సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 14 । జూన్ । 2024



సోమశిలలో 8.49 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 8.498 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2094 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.73,820
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,612
3 శాతం జీఎస్టీతో	రూ.6,810
సవర (8 గ్రా)	రూ.54,480

గరిష్టం/కనిష్టం
36.2 /27.1

వాతావరణం

గాలిలో తేమ 52 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు శుక్రవారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నవరత్నాల బోర్డు ధ్వంసం



ఉలవపాడు: రామాయపట్నం గ్రామ సచివాలయంపై ఉన్న నవరత్నాల బోర్డును కూటమికి చెందిన కార్యకర్తలు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. తాడుకట్టి పైకెక్కి ధ్వంసం చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో రాజకీయ ద్వేషాలను పెంచేలా ఇలాంటి చర్యలకు కొందరు పాల్పడుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జమ్ము మాధవ తెలిపారు.

16న ఆర్చరీ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఆర్చరీ జట్లను ఈ నెల 16న ఎంపిక చేయనున్నామని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. వివరాలకు 94419 55334 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పర్వతారోహణకు టీపీగూడూరు విద్యార్థి ఎంపిక



విద్యార్థికి అభినందన

నెల్లూరు (టౌన్): తోటపల్లిగూడూరు మండలంలోని జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బధిర విద్యార్థి ప్రసాద్ లద్దాఖ్‌లో వచ్చే నెల్లో నిర్వహించనున్న పర్వతారోహణకు అర్హత సాధించారు. ఈ క్రమంలో నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థిని డీఈఓ రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైఎస్సార్ జిల్లాలోని గండికోటలో ఈ నెల ఏడు నుంచి నిర్వహించిన దివ్యాంగుల అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో ట్రెక్కింగ్, రాంప్లింగ్, హైకింగ్‌లో ప్రసాద్ ఉత్తమ ప్రతిభను చూపారని చెప్పారు. సీఎంఓ పెంచలయ్య, ప్రధానోపాధ్యాయుడు రియాజ్ అహ్మద్, ఉపాధ్యాయుడు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బదిలీ

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అదనపు సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా పనిచేస్తున్న రమేష్‌ను మాతృశాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. గతంలో వ్యవసాయ శాఖ పరిధిలోని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్లో సీనియర్ సైంటిస్ట్‌గా ఈయన పనిచేసేవారు. ఈ క్రమంలో డిప్యుటేషన్‌పై ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. ఏడాది పూర్తి కావడంతో మాతృశాఖకు పంపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్యకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

డీఏఏబీ చైర్మన్ పదవికి రాజీనామా



నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి కమిటీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. దీనికి సంబంధించిన లేఖను రాష్ట్ర వ్యవసాయ ప్రత్యేక కార్యదర్శికి పంపారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.477 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.



నెల్లూరులోని కేఎన్నార్ పాఠశాల వద్ద విద్యార్థుల కోలాహలం





మూలాపేటలోని నారాయణ స్కూల్ వద్ద సందడి

సందడే.. సందడి

బడి బాట పట్టిన విద్యార్థులు

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. దీంతో స్కూళ్లు విద్యార్థులు, తల్లిదండ్రులతో కళకళలాడాయి. 3,06,832 మంది విద్యార్థులకు గానూ తొలి రోజు 1,85,491 మంది హాజరయ్యారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో కొందరికే విద్యా కిట్లను అందజేశారు. మిగిలిన వారికి మరో రెండు, మూడు రోజుల్లో అందజేయనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.
– నెల్లూరు (టౌన్)

యథేచ్ఛగా ఫీజులుం

ఇష్టారాజ్యంగా వసూళ్లు

ప్రస్తుత విద్యాసంవత్సరంలో స్కూళ్లు గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు చెప్తున్న ఫీజు వివరాలను విని నివ్వెరపోవడం విద్యార్థుల తల్లిదండ్రుల వంతవుతోంది. స్కూల్‌ను బట్టి రూ.20 వేల నుంచి రూ.లక్షన్నర వసూలు చేస్తుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీలను పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. మరోవైపు ఫీజు రాయితీపై ఎవరైనా ప్రశ్నిస్తే సీటు లేదనే సమాధానం ఆయా స్కూళ్ల యాజమాన్యాల నుంచి వస్తోంది. ఈ తతంగం యథేచ్ఛగా జరుగుతున్నా, జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

- స్కూల్‌ను బట్టి రూ.20 వేల నుంచి రూ.1.5 లక్షలు
- ఏటా ఐదు నుంచి పది శాతం పెంపు
- పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ విక్రయాలు
- రాయితీ అడిగితే సీటు లేదంటున్న నిర్వాహకులు
- బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- చోద్యం చూస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు



నెల్లూరు (టౌన్): పాఠశాలలను పునఃప్రారంభించారంటేనే విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన స్టార్టవుతోంది. పాఠశాల.. ఉపాధ్యాయులు.. ఫీజులు.. తదితర వివరాలను తెలుసుకునేందుకు విద్యాసంస్థలకు క్యూ కడుతున్నారు. అప్పు చేసైనా తమ పిల్లలను మంచి పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని సొమ్ము చేసుకోవాలనే లక్ష్యంతో రకరకాల పేర్లతో బ్రాంచీలు పెట్టి ఫీజులను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అమాంతం పెంచేస్తున్నాయి.

నిబంధనలు మాకు పట్టవు..

పాఠశాలను బట్టి రూ.20 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఫీజును వసూలు చేస్తున్నారు. వీటి వివరాలను నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించాలనే ప్రభుత్వ నిబంధనను సైతం బేఖాతర్ చేస్తున్నారు. పైగా పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ తదితరాలను విక్రయిస్తున్నారు. ఫీజుతో సంబంధం లేకుండా వీటికి అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంటోంది.

వామ్మో.. ఇంత ఫీజా..?

జిల్లాలో 814 కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 1,72,230 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ, నీట్, కాన్సెప్ట్ తదితర పేర్లతో ఫీజులను ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు అమాంతం పెంచేశారు. పాఠశాల బట్టి రూ.25 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఏటా ఐదు నుంచి పది శాతం మేర పెంచుతున్నారు. ఫీజు పెంపుపై ఎవరైనా ప్రశ్నిస్తే.. తాము డొనేషన్ వసూలు చేయడం లేదు కదాననే సమాధానం వస్తోంది. తొలుత 60 శాతం.. మిగిలిన 40 శాతాన్ని దసరా సెలవుల అనంతరం చెల్లించాలనే నిబంధన పెడుతున్నారు.

అర్హత లేని వారితో బోధన

వాస్తవానికి బీఈడీ, ఎంఈడీ చదివిన ఉపాధ్యాయులతోనే పాఠశాలల్లో బోధించాల్సి ఉంది. అయితే కొన్ని పాఠశాలల్లో నలుగురైదుగురు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులనే తీసుకుంటున్నారు. తదుపరి ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన వారితో బోధన సాగిస్తున్నారు. మరోవైపు ఏ పాఠశాలలోనూ క్రీడా మైదానం లేదు. అగ్నిమాపక సర్టిఫికెట్ తదితర పత్రాలు తప్పనిసరనే నిబంధన ఉన్నా, అధిక శాతం పాఠశాలలకు ఇవి లేవని సమాచారం.

పుస్తకాలకూ ధర

ప్రభుత్వ నిబంధనలు మేరకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ తదితరాలను విక్రయించకూడదు. అయితే క్షేత్రస్థాయిలో ఇవి జరుగుతూనే ఉన్నాయి. పుస్తకాలకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో యూనిఫారాన్ని సైతం విక్రయిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు మాత్రం ఫలానా వస్త్ర దుకాణంలోనే కొనుగోలు చేయాలనే నిబంధనను విధిస్తున్నాయి. క్యాంటిన్లను ఏర్పాటు చేసి ధరలను అధిక మొత్తంలో వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల స్థానంలో సొంత మెటీరియల్‌ను తయారు చేసి వీటితో బోధన సాగిస్తున్నారు.

తనిఖీలు పట్టని అధికారులు

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్నా, జిల్లా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉన్నా, ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసిన దాఖలాల్లేవు. రెన్యువల్, అడ్మిషన్ల సమయంలో ఆయా యాజమాన్యాలు పాఠశాలను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అందజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంతోనే జిల్లా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజు దోపిడీ, నిబంధనల ఉల్లంఘనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

ప్రతి మండలంలో త్రిసభ్య కమిటీని నియమించాం. ఇందులో ఎంఈఓ, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు, కాంప్లెక్స్ హెచ్‌ఎంను నియమించాం. వివరాలను సేకరించి నిబంధనలను అతిక్రమించారని తెలిస్తే చర్యలు చేపడతాం. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేట్ పాఠశాలలను నిర్వహించాలి. ఫీజు వివరాలను ఆయా పాఠశాల నోటీస్ బోర్డుల్లో తప్పక ప్రదర్శించాలి.
– రామారావు, డీఈఓ

ముగిసిన పొగాకు వేలం

- రూ.153 కోట్ల మేర కొనుగోళ్లు
- ఈ ఏడాది ధరలు ఆశాజనకం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 75 రోజులుగా నిర్వహిస్తున్న పొగాకు వేలం గురువారంతో ముగిసింది. 2023 – 24 పంట కాలానికి సంబంధించిన పొగాకు కొనుగోళ్లు ఏప్రిల్‌లో ప్రారంభమయ్యాయి. రైతుల వద్ద అధిక దిగుబడి ఉండటంతో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా విక్రయానికి బోర్డు అనుమతిచ్చింది. డీసీపల్లి వేలం కేంద్ర పరిధిలోని 4989 హెక్టార్లలో 1720 బ్యారెన్లలో 2093 మంది రైతులు పొగాకును సాగు చేశారు.

అన్ని రకాల గ్రేడ్లకు మంచి ధరలు

పొగాకు సాగులో రైతులు ఏటా నష్టాలను చవిచూసేవారు. అయితే రెండేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో రైతులు తమ పొలాల్లో పొగాకును సాగు చేశారు. ఈ ఏడాది అన్ని రకాల గ్రేడ్ల పొగాకుకు సరైన ధర.. మార్కెట్ బాగుండటంతో లాభాలు దక్కాయి. ఈ ఏడాది మంచి ధరలు లభించడంతో రైతుల కష్టానికి ఫలితం దక్కింది.

గరిష్ట ధర రూ.352

డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్ర పరిధిలో ఈ ఏడాది నిర్వహించిన వేలంలో రైతులకు గరిష్ట ధర రూ.352 లభించింది. కనిష్ట ధర రూ.204.. మొత్తమ్మీద రూ.253.55గా నమోదైంది. వేలానికి 56,988 బేళ్లు రాగా, వీటిలో 48,287 బేళ్లను వివిధ కంపెనీల ప్రతినిధులు కొనుగోలు చేశారు. మిగిలిన 8071 బేళ్లలో 2451 నోసేల్.. 3383 నోబిడ్.. 26 రైతుల రిజెక్షన్.. 1715 కంపెనీ రిజెక్షన్.. 1126 బేళ్లను బీఆర్‌గా నమోదు చేశారు. వేలంలో 6.06 మెట్రిక్ కిలోల పొగాకును కొనుగోలు చేయగా, దాదాపు రూ.153 కోట్ల వ్యాపారం జరిగింది. 34 కంపెనీలకు చెందిన ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. వేలాన్ని పోటాపోటీగా నిర్వహించడంతో రైతులకు మంచి ధరలు లభించాయి.

ఆశాజనకంగా ధరలు



ఈ ఏడాది రైతులకు ధరలు ఆశాజనకంగా లభించాయి. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం మంచి ధరలు ఉన్నాయి. దీంతో వేలం కేంద్రాల్లో పొగాకు ధరలు నిలకడగా ఉండి రైతులకు లాభాలను తెచ్చిపెట్టాయి. వేలం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమే బోర్డు లక్ష్యం.
– రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి పొగాకు బోర్డు

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీని నివారిద్దాం



నెల్లూరు(వేదాయపాళెం): బీసీజీ టీకా ద్వారా జిల్లాలో టీబీని నివారిద్దామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తెలిపారు. నగరంలోని రాజరాజేశ్వరి గుడి సమీపంలో గల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జిల్లా కార్యాలయంలో అర్హులకు బీసీజీ టీకాలను వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడారు. షుగర్ వ్యాధిగ్రస్తులు.. 60 ఏళ్ల పైబడిన వారు.. ఇలా ఆరు కేటగిరీలకు చెందిన వ్యక్తులకు టీకాలను వేస్తున్నామని వివరించారు. టీకాలను అర్హులు విధిగా వేయించుకోవాలని కోరారు. అనంతరం పలువురు అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు టీకాలు వేశారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, రాష్ట్ర పరిశీలకుడు శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న రామారావు

వెంకటాచలం: విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యను ఉపాధ్యాయుల బోధించాలని డీఈఓ రామారావు సూచించారు. వెంకటాచలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించేలా ప్రారంభం నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయాన్ని పరిశీలించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన కిట్లను సత్వరమే చేర్చాలని ఆదేశించారు. ఎంఈఓ – 2 శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకరనగరంలో ఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న ఆరిఫ్ హఫీజ్

సోమశిల: అనంతసాగరం మండలం శంకరనగరంలో ఇరువర్గాల మధ్య బుధవారం జరిగిన దాడుల ఘటనపై గ్రామంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ విచారణను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య జరిగిన ఘర్షణలో దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మిగిలిన వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేంత వరకు పోలీస్ బృందాలతో ప్రత్యేక బందోబస్తు కొనసాగుతుందని వెల్లడించారు. గ్రామంలో ప్రస్తుతం 144 సెక్షన్‌ను అమలు చేశారన్నారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సీఐ వేణు, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

శంకరనగరంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురిపై కేసులు నమోదు చేశామని అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల ఇంట్లోకి చొరబడి దాడి చేయడం, భీభత్సం సృష్టించడంతో టీడీపీకి చెందిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. వైఎస్సార్సీపీ నేతలు 17 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు పది మందిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చిన్నారులకు పీఎం కేర్స్ బాండ్ల అందజేత



చిన్నారులకు బాండ్లు అందజేస్తున్న సీడీపీఓ, సర్పంచ్

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళేనికి చెందిన అనాథ చిన్నారులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎం కేర్స్ బాండ్లను గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన అల్లాడి సాయి, కవిత దంపతులు 2021 మే 12న కరోనాతో మృతి చెందారు. దీంతో వారి చిన్నారులు లాస్య, ప్రజ్వల్ అనాథలుగా మారారు. వీరికి కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలను మంజూరు చేసింది. ఈ నగదును బ్యాంక్‌లో డిపాజిట్ చేసి బాండ్లను ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి చిన్నారులకు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో ఎమ్మెల్సీలతో జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను కల్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ యువత విభాగం కార్యదర్శి కొణిదల నాగేంద్ర ఉన్నారు.

పూరిల్లు దగ్ధం



ఇందుకూరుపేట: మండలంలోని కొమరిక గ్రామానికి చెందిన దాసరి సుభాషిణమ్మ పూరిల్లు గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఈ సమయంలో గ్యాస్ సిలిండర్ పేలింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. వృద్ధురాలైన సుభాషిణమ్మ కట్టుబట్టలతో మిగిలారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైళ్లలో చోరీలపై దర్యాప్తు ముమ్మరం

బిట్రగుంట: శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున సిగ్నల్స్ ట్యాంపరింగ్ చేసి ధర్మవరం ఎక్స్‌ప్రెస్, తిరుపతి స్పెషల్ రైళ్లలో దొంగలు చోరీలకు పాల్పడిన ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనా స్థలం నుంచి సాంకేతిక ఆధారాలు సేకరించడంతో పాటు ఈ తరహా నేరాల్లో ఆరితేరిన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌ల కదలికలపై గురువారం ఆరా తీశారు. మహారాష్ట్రకు చెందిన సుమారు పదికి పైగా గ్యాంగ్‌లు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎనిమిది గ్యాంగ్‌లు సిగ్నల్స్ ట్యాంపర్ చేసి దోపిడీలు చేయడంలో సిద్ధహస్తులని తెలిసింది. వారి కదలికలకు సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో సేకరిస్తున్నారు. మీర్జాపూర్, శిక్కా గ్యాంగ్‌లు ఎక్కువగా ఏపీలో ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో దర్యాప్తు వేగవంతం చేశారు. అదే విధంగా స్థానికంగా కూడా ఇలాంటి నేరాలకు పాల్పడే వారి గురించి తెలుసుకునే పనిలో ఉన్నారు. రైళ్లలో తిరుగుతూ ముందుగానే స్టేషన్ ఔటర్లకు దగ్గరగా ఉండే సిగ్నలింగ్ పాయింట్లను గుర్తిస్తున్న ముఠాలు సమయం చూసుకుని సిగ్నల్స్ ట్యాంపర్ చేయడం ద్వారా దోపిడీలకు పాల్పడుతున్నాయి. 2016 నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఈ తరహా నేరాలకు రైల్వేశాఖకు, రైల్వే పోలీసులకు తలనొప్పిగా మారాయి. రైల్వే పోలీసులు ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు చేపడుతున్నా సిగ్నల్ ట్యాంపరింగ్ చేసే ఘటనలు మాత్రం ఆగడం లేదు.



ఈ చిత్రంలో రక్తదానం చేస్తున్న వ్యక్తి పేరు చంద్రగిరి అజయ్‌బాబు. ఉపాధ్యాయుడు. బోధనా రంగంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. పాఠశాల నుంచి వచ్చిన వెంటనే ఒక్క నిమిషం వృథా చేయరు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో సేవలందిస్తారు. ఆయన కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏ పాజిటివ్ గ్రూపు కలిగిన ఆయన 104 సార్లు రక్తదానం చేశారు.



ఈ చిత్రంలో రక్తదానం చేస్తున్న వ్యక్తి పేరు పి.కిరణ్‌కుమార్‌రెడ్డి. జిల్లాలోని లేబూరు వాసి. సామాజిక కార్యక్రమాలపై మక్కువ. అందులో భాగంగా రక్తదానంపై అవగాహన పెంచుకున్నారు. ఓ పాజిటివ్ గ్రూపు కలిగిన ఆయన ఇప్పటికి 94 సార్లు రక్తదానం చేశారు.



ఈ చిత్రంలో రక్తదానం చేస్తున్న వ్యక్తి పేరు మదనపల్లి మధుసూదన్‌రావు. ఓ పాజిటివ్ గ్రూపు రక్తాన్ని కలిగి ఉన్నారు. ఈయన బ్లడ్‌బ్యాంకులో మోటివేటర్‌గా పని చేస్తున్నారు. నిత్యం విద్యార్థులను, ప్రజలను, స్వచ్ఛంద సంస్థలను చైతన్యం చేస్తూ బ్లడ్ క్యాంపులు నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఎప్పుడు రక్తం అవసరం అనిపించినా.. తానున్నానంటూ అత్యధికంగా 133 సార్లు దానం చేశారు. అనేక అవార్డులు అందుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సార్లు రక్తం దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు.

ప్రాణదాతలు

- ఆపదలో ఉన్న రోగులకు, క్షతగాత్రులకు రక్తం తప్పనిసరి
- జిల్లాలో 8 బ్లడ్‌బ్యాంకుల ద్వారా సేకరణ
- సుమారు 50 శాతం అవసరాలు తీరుస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్
- గతేడాది రక్తదానం చేసిన వారు 37,116 మంది
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన వారికి అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. తలసేమియాతో బాధపడేవారికి రెండు, మూడు వారాలకొకసారి రక్తం ఎక్కించాలి. కేన్సర్ రోగులకు, అత్యవసర శస్త్రచికిత్సల్లో రక్తం ఎంతో అవసరం. సకాలంలో అందకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇలాంటి వారిని రక్తదానమే ప్రాణాలు కాపాడుతోంది. అందుకే రక్తదాతలను ప్రాణదాతలంటారు.



నెల్లూరు(అర్బన్): రక్తం శరీరానికి ఇంధనం వంటిది. అత్యవసర సమయాల్లో ఇంకొకరి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం తప్పనిసరి. దీనివల్ల మరొకరి జీవితాల్లో వెలుగులు నింపొచ్చు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినప్పుడు శరీరంలో రక్తం తగ్గిపోతుంది. పౌష్టికాహార లోపంతో అనేక మంది అనీమియా (రక్తహీనత)కు గురవుతున్నారు. దీంతో ముఖ్యంగా మహిళలు ప్రసవ సమయంలో ఇబ్బంది పడిన ఘటనలు ఉన్నాయి. ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తుంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు రక్తం దానం చేయాలి. ఆరోగ్యవంతమైన ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలి. ఇతర జిల్లాలతో పోల్చితే నెల్లూరు జిల్లాలో రక్తదాతలు ఎక్కువమంది ఉన్నారు.

ఆరోగ్యానికి మేలు

రక్తదానం చేసిన వ్యక్తికి ఎంతోమేలు జరుగుతుంది. పలురకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.మానసిక ఆరోగ్యం సైతం మెరుగుపడుతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. శరీర రక్తంలో మోతాదుకు మించి ఐరన్ ఉంటే గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. రక్తదానంతో ఇలాంటి రిస్క్ తగ్గుతుంది. బరువు కూడా తగ్గుతారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో స్వచ్ఛంద రక్తదాతలు పెరుగుతున్నారు. రెడ్‌క్రాస్ తదితర సంస్థల్లో 24 వేల మంది వరకు సభ్యులున్నారు. జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, నోవాబ్లడ్ బ్యాంకు, అపోలో ఆస్పత్రి, నారాయణ ఆస్పత్రి, న్యూలైఫ్, కావలి ఏరియా ఆస్పత్రి, కావలి కేకేఆర్ రెడ్‌క్రాస్ తదితర బ్లడ్‌బ్యాంకులు జిల్లాలో రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నాయి. జిల్లాలో గత సంవత్సరం అన్ని బ్లడ్ బ్యాంకుల ద్వారా 422 క్యాంపులు నిర్వహించి 37,116 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇందులో రెడ్‌క్రాస్ ఒక్కటే 256 క్యాంపులు ద్వారా 16,280 యూనిట్ల రక్తాన్ని సేకరించడం విశేషం. ఒక్క యూనిట్ రక్తాన్ని మూడు కాంపోనెంట్లుగా విభజించి ముగ్గురు ప్రాణాలను కాపాడొచ్చు. జిల్లాలో రక్తదాతలు పెరగడం శుభపరిణామమని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత జనాభాలో ఏడు శాతం వరకు రక్తదానం చేస్తే కొరత ఉండదనిని చెబుతున్నారు.

ప్రతి సంవత్సరం

రక్తదాన ప్రాముఖ్యతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ రక్తాన్ని మొదటి సారిగా వర్గీకరించిన కార్ల్ లాండ్ స్టెయినర్ జయంతిని పురస్కరించుకుని 2004 జూన్ 14 నుంచి ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో, మద్రాస్ బస్టాండ్ వద్ద ఉండే రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో, కావలి టౌన్‌లో రక్తదాన శిబిరాలు జరుగుతాయి.

అపోహలు వీడాలి

రక్తదానం వల్ల శరీరం నీరసించి పోతుంది. బలహీన పడుతుంది. శక్తి తగ్గుతుందనే ప్రచారముంది. ఇవన్నీ అపోహలని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతి మనిషి శరీరంలోని రక్తకణ జీవిత కాలం సుమారు 120 రోజులు. తర్వాత పాత రక్తకణాలు నశించి కొత్త రక్తకణాలు ఏర్పడుతాయి. అందువల్ల ఆరోగ్యవంతమైన 18 నుంచి 60 ఏళ్ల లోపు పురుషులు ప్రతి మూడు నెలలకోమారు, స్త్రీలు ప్రతి ఆరునెలలకు ఒక దఫా నిరభ్యంతరంగా రక్తదానం చేయొచ్చు. కాగా చెడు అలవాట్లు ఉన్నవారు, హెపటైటిస్ బీ, సీ ఉన్న వారు, హెచ్ఐవీ సోకిన వారు అధిక బీపీ ఉన్న వారు, కేన్సర్ లాంటి జబ్బులకు గురైన వారు రక్తదానం చేయకూడదు.

ఇబ్బంది పెట్టారా.. ఫిర్యాదు చేయొచ్చు

- బాధితులకు అండగా పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ

నెల్లూరు(క్రైమ్): అండగా నిలవాల్సిన పోలీసులే ఇబ్బంది పెడుతున్నారా? విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడినా, సత్వర న్యాయం అందని సందర్భాల్లో సామాన్యునికి ఉచితంగా న్యాయం అందించేందుకు పోలీసు ఫిర్యాదుల ప్రాధికార సంస్థ (పీసీఎ) ఏర్పడింది. బాధితులు నేరుగా సదరు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు.

దేశ సర్వోన్నత న్యాయస్థానం 2006లో ప్రకాష్ సింగ్ కేసులో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో జారీచేసిన మార్గదర్శక సూత్రాలను అనుసరించి అన్ని రాష్ట్రాల్లో పోలీసులపై వచ్చే ఫిర్యాదులను విచారించేందుకు ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేయడం జరిగింది. మన రాష్ట్రంలో రాష్ట్ర/జిల్లా స్థాయిలో సదరు సంస్థలను ఏర్పాటు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించి సంస్థ కార్యాలయాన్ని గుంటూరు కాజా టోల్‌గేట్ సమీపంలోని లాస్య రెసిడెన్సీ–2లోని 106, 107 ఫ్లాట్ నంబర్లలో ఏర్పాటు చేశారు.

కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు..

ప్రాధికార సంస్థలో చైర్మన్‌తో సహా ముగ్గురు సభ్యులుంటారు. జిల్లా పరిధిలోని కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులపై ఫిర్యాదు చేయొచ్చు. సదరు ఫిర్యాదులపై సంస్థ విచారణ జరిపి తగిన చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిస్తారు. బాధితులను కొట్టినా, ఇబ్బందులకు గురిచేసినా తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అక్కడ స్టేషన్ అధికారి సక్రమంగా స్పందించకపోతే డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లాలి. అక్కడ కూడా ఫిర్యాదుపై అధికారులు చట్టప్రకారం కేసులు నమోదు చేయకపోతే ప్రాధికార సంస్థకు ఫిర్యాదు చేయొచ్చు. ఈ సంస్థ కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధ్యులైన పోలీసు అధికారుల వివరణ తీసుకుని పూర్తిస్థాయిలో విచారించి తుది నివేదికను మూడు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తారు. అయితే ఫిర్యాదుదారులు తాము కచ్చితమైన సమాచారం ఇస్తున్నామని ప్రమాణపత్రం (అఫిడవిట్) తోపాటు లిఖిత పూర్వక ఆధారాలను అందించాలి.

ఏ సందర్భంలో..

- పోలీస్ కస్టడీలో జరిగే మరణాలు.
- కస్టడీలో జరిగే లైంగికదాడి.
- కస్టడీలో జరిగే తీవ్రమైన గాయాలు.
- పోలీసుల బలవంతపు వసూళ్లు.
- పోలీసుల భూ దందాలు.
- అధికార దుర్వినియోగానికి పాల్పడితే.

ఇలాంటివి తీసుకోరు

- అస్పష్టమైన, ఆకాశరామన్న ఫిర్యాదులు, మారుపేరుతో కూడుకున్నవి.
- సంఘటన జరిగి ఏడాది కాలం ముగిసినవి.
- ఉద్యోగుల సర్వీసు విషయాలు, కార్మికులు లేదా పారిశ్రామిక వివాదాలు.
- ఏదైనా న్యాయస్థానం, ట్రిబ్యునల్‌లో ఉన్న వ్యవహారాలు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్

బాధితులు 98498 18351 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. ఇప్పటి వరకు ఇటువంటి సంస్థలు లేకపోవడంతో పోలీసులు అక్రమాలు చేస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్న వారికి బాసటగా ఉండేందుకు ఈ సంస్థ దోహదపడుతుంది.

మేకపిల్లను రక్షించే ప్రయత్నంలో..

- బావిలో దిగి వృద్ధుడి మృతి



వెంకటయ్య మృతదేహం

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో దిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈర్ల వెంకటయ్య (75) బుధవారం తన జీవాలను అడవికి మేతకు తోలుకెళ్లాడు. మందలోని మేకపిల్ల బావిలో పడిపోవడంతో దానిని రక్షించేందుకు వెంకటయ్య బావిలోకి దిగాడు. మేకపిల్లను రక్షించి బయటకు తీసుకొచ్చే క్రమంలో బావిలో అల్లుకుపోయిన తామర వేర్లు కాళ్లకు చుట్టుకొని మునిగిపోయాడు. వెంకటయ్యకు భోజనం ఇచ్చేందుకు భార్య చుట్టుపక్కల గాలించి బావి వద్దకు వచ్చి చూసింది. అక్కడ చెప్పులు, వాటర్‌బాటిల్ ఉండటంతో వెంటనే గ్రామంలోకి వెళ్లి విషయాన్ని తెలిపింది. గ్రామస్తులు బావి వద్దకు చేరుకుని వెంకటయ్యను బయటకు తీసేందుకు ప్రయత్నించగా చీకటి పడడంతో వెనుదిరిగారు. గురువారం ఉదయం వెంకటయ్య మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 157
లేయర్ (లైవ్) : 120
బ్రాయిలర్ చికెన్ : 276
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 306
లేయర్ చికెన్ : 204

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.80
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్ట్

- రూ.25 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

తిరుపతి క్రైమ్: జిల్లాలో అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. పోలీసుల కథనం.. జిల్లా పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, అలిపిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో తమిళనాడుకు చెందిన మహేష్ మణికంఠ, వెస్ట్ గోదావరికి చెందిన షేక్ అలీమొహిద్దీన్ దొంగతనాలకు పాల్పడేవారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయి. తిరుపతి పరిసర ప్రాంతాల్లో తచ్చాడుతుండగా గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్దాయి మహేష్ మణికంఠపై రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50కి పైగా కేసులున్నాయి. అదేవిధంగా షేక్ అలీమొహిద్దీన్‌పై 40కి పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. వీరు రెక్కీ నిర్వహించి దోపిడీలకు పాల్పడేవారు. అదేవిధంగా తాళం వేసి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడేవారు. రూ.25 లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారు, 2.25 కిలోల వెండి, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు మంజూరు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

వాటర్ ప్లాంట్ శిలాఫలకం ధ్వంసం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాళెం గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ధ్వంసం చేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి నిధులు రూ.7 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధ్వంసమైన శిలాఫలకం

22న పెంచలకోనలో జ్యేష్టాభిషేకం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీన జ్యేష్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. జ్యేష్ట మాసంలో జ్యేష్టా నక్షత్రం, పౌర్ణమి ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవాలయాల్లో హోమం, అభిషేకాలు నిర్వహించడం ఆచారమన్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, పూలంగిసేవ, నరసింహ హోమం, 10 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో స్నపన పీఠంపై నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి 81 కలశాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,068 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 33,372 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీ కానుకలు రూ.3.48 కోట్లు లభించాయి. టైంస్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు రెండు గంటల్లో దర్శన భాగ్యం కలుగుతోంది.